ప్రజాశక్తి
మంగళవారం 19 మార్చి 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





ఎమర్జెన్సీ ల్యాండింగ్

ట్రయల్ రన్ విజయవంతం



ల్యాండింగ్ అవుతున్న యుద్ధవిమానం

ప్రజా శక్తి - బాపట్ల జిల్లా, అద్దంకి

అత్యవసర పరిస్థితులలో విమానాలు కిందకు దిగేందుకు కోరిశపాడు మండలం పిచికల గుడిపాడు వద్ద 16 నెంబర్ జాతీయ రహదారిపై 4.1 కిలో మీటర పొడవునా ఎమర్జెన్సీ ల్యాండింగ్‌ను నిర్మించారు. అక్కడ భారత వైమానిక దళం అధికారులు సోమవారం ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై నిర్వహించిన ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ విజయవంతమైంది. ఈ సందర్భంగా 528 మంది పోలీసు సిబ్బందితో ఎస్‌పి వకుల్ జిందాల్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాహన చోదకులకు ఇబ్బందులు కలుగకుండా వాహనాలను దారిమళ్లించారు. ఈ సందర్భంగా ఎస్‌సి మాట్లాడుతూ వరదలు, భూకంపాలు, ప్రకతి విపత్తులతో పాటు అత్యవసర పరిస్థితులలో విమానాలకు ల్యాండింగ్ సౌకర్యం కల్పించారన్నారు. గత డిసెంబర్‌లో ఒకసారి ట్రయిల్ రన్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండో దపా వైమానిక దళం అధికారులు నిర్వహించిన ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ విజయవంతం కావడం ▶ 2లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

క్వారీ గుంతలో ఈతకెళ్లి..

ఇద్దరు చిన్నారులు మృతి

- పెద్దదోర్నాలలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని యడవల్లి బలిజేపల్లి దారిలోనున్న జీరుకొండపై ఉన్న క్వారీలో సోమవారం వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. పెద్దదోర్నాలలోని ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న కొండెబోయిన ప్రసన్న కుమార్(12), దూదేకుల వలి(9) స్నేహితులు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఈత కొట్టేందుకు జీరుకొండ పైనున్న క్వారీ వద్ద వెళ్లారు. దుస్తులు ఇప్పి గట్టుపై పెట్టారు. కొద్దిసేపు ఒడ్డున నీటిలో ఆటాడుకుంటూ చిన్న చేప పిల్లలను పట్టుకుంటూ సరదగా గడిపారు. అనంతరం ఈత కొట్టేందుకు లోనికి వెళ్లారు. అక్కడ లోతు ఎక్కువగా ఉంటడంతో నీట మునిగారు. ఊపిరి అందకపోవడంతో మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన కొందరు సోమవారం క్వారీ సమీపంలో రాళ్ళు ఏరుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో క్వారీలోని నీటిలో దూదేకుల వలి విగతజీవిగా మారి తేలుతూ కనిపించాడు. ఈ విషయాన్ని గమనించిన వారు స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అంకమరావు క్వారీ వద్ద పరిశీలించారు. అక్కడ రెండు జతల దుస్తులు, రెండు జతల చెప్పులు ఉన్నాయి. దీంతో మరో మృతదేహం కూడా క్వారీలో ఉండవచ్చునని బావించారు. తొలుత గ్రామస్తుల సహకారంతో నీటిపై తేలుతున్న దూదేకుల వలి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం ఈతగాళ్ల సాయంతో క్వారీలో వెతికించారు. గజ ఈతగాళ్ళ ప్రసన్న కుమార్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు ▶ 2లో



మృతిచెందిన వలి



మృతిచెందిన ప్రసన్న కుమార్



పసన్న కుమార్ (ఫైల్)



వలి (ఫైల్)

వైపాలెంలో ఉత్కంఠ పోరే..!

- వైసిపి, టిడిపి అభ్యర్థుల ఖారారు
- గెలుపే లక్ష్యంగా ఇరు పార్టీల ఎత్తుగడలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సార్వత్రిక ఎన్నికలకు యర్రగొండపాలెం నియోజక వర్గంలో ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. వైసిపి అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబు ఎన్నికల బరిలో దిగుతున్నారు. వారి మధ్య ఉత్కంఠ పోరు సాగే అవకాశం ఉంది. 2009లో యర్రగొండపాలెం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వుగా ఏర్పడింది. 2009లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఆదిమూలపు సురేష్ గెలుపొందారు. 2014లో వైసిపి అభ్యర్థి పాలపర్తి డేవిడ్‌రాజు గెలుపొందారు. 2019లో వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యేగా ఆదిమూలపు సురేష్ గెలుపొందారు. ఈ నియోజకవర్గం ఏర్పాటు చేనప్పటి నుంచి టిడిపి ఒక్కసారి కూడా భోణి కొట్టలేదు. వైసిపి కంచుకోటగా మారింది. ఎలాగైన వైసిపి కంచుకోటను బద్దలు కొట్టి గెలుపొందాలని టిడిపి అధిష్టానం పావులు కదుపుతోంది. ఏడాది క్రితమే టిడిపి అధినేత చంద్రవబాబు నాయుడు యర్రగొండపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో గూడూరి ఎరిక్షన్‌బాబును టిడిపి అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటి నుంచి ఎరిక్షన్‌బాబు పార్టీని తన భుజస్కాందాలపై మోస్తూ గెలుపు జెండా పాతేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10న యర్రగొండ పాలెంలో బహిరంగ సభ నిర్వహించాలని తలపెట్టారు. అయితే కూటమి సభ ఈనెల 18న చిలకలూరి పేటలో నిర్వహించిన నేపథ్యంలో యర్రగొండపాలెంలో సభ వాయిదా పడింది.





ప్రారంభమైన వలసలు..

వైసిపి పుల్లలచెరువు మండల కన్వీనర్ బోగోలు వెంకట సుబ్బారెడ్డి తన అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. అదేవిధంగా పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో సైతం కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు, ఇద్దరు సర్పంచులు, ఒక ఎంపిటిసి టిడిపిలో చేరారు. అలాగే ప్రతి గ్రామంలో కొందరు కార్యకర్తలు వైసిపిని వీడి టిడిపిలో చేరుతున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరడంతో ఆయనతో అనుకూలంగా ఉరన్న కొందరు నాయకులు టిడిపి బాట పడుతున్నారు. అదేవిధంగా టిడిపి చెందిన కొందరు నాయకులు కూడా వైసీపీ బాట పడుతున్నారు.

గెలుపే లక్ష్యంగా వైసిపి...

యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈ పాటికే రెండు సార్లు వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. ముచ్చటగా మూడోసారి విజయం సాధించే దిశగా ఆ పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే ▶ 2లో



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మతోన్మాద బిజెపిని ఓడించండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో మతోన్మాద బిజెపిని ఓడించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు, ,కార్మికులు, ప్రజా వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చారన్నారు. 44కార్మిక చట్టాలు రద్దుచేసి 4 లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. 2019 మోటార్ వెహికల్ చట్టం ,2020 విద్యుత్ చట్టం ,హిట్, రన్ చట్టం ,ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విదానం ,సిఎఎ ,ఎలక్ట్రోరల్ బాండ్లు ,ధరల పెరుగుదల ,ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయటం లాంటి విషయాలలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో వైఫల్యం చెందారన్నారు. రైతులకు ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందన్నారు. .ఈనేపథ్యంలో కేంద్రంలో మతోన్మాద బిజెపిని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి ,బంకా సుబ్బారావు ,జివి.రాగయ్య ,పిసి.కేశవరావు, ఈదర అన్నపూర్ణ,పారా శ్రీనివాసరావు ,తాండవ రంగారావు ,డికెఎం.రఫీ ,టి.మహేష్ ,చిరంజీవి , పి.ఆంజనేయులు ,టి.ఆవులయ్య పాల్గొన్నారు.

పొదిలిలో ట్రాఫిక్ ఇక్కట్లు

పొదిలి : పొదిలి రోజురోజుకు రద్దీ పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పదో తరగతి పరీక్షలు, మధ్యాహ్నం ఓపన్ స్కూల్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ మార్గంలో ఎక్కడిక్కడ ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని 15వ డివిజన్‌లో ఆర్యవైశ్య వైసిపి నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్, కొంకిమాళ్ళ శ్రీనివాసరావు, టి.రంగస్వామి, మువ్వల నాగరాజు, నూకల శ్రీనివాసరావు, దేవకి శ్రీనివాసరావు, పి.రవి కుమార్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. వారికి జనార్దనరావు కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాగుంట రాఘవరెడ్డి, దూండి రాకేష్ ఆర్యవైశ్య నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారిలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తిపురాంతకం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో కళావేదిక జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిముక్కుల నాసరయ్య ఆధ్వర్యంలో జాతీయ ఉగాది శతాధిక కవి సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎన్ వెంకటేశ్వర్లు, ఎంఇఒ తులసి మల్లికార్జున నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - శింగరాయకొండ



విజేతలతో ఉపాధ్యాయులు

గత నెలలో నిర్వహించిన ఐఎన్‌టిఎస్‌ఒ పరీక్షా ఫలితాలు సోమవారం వెలువడాయి. ఈ పరీక్షల్లో శింగరాయకొండ లోని శ్రీచైతన విద్యార్థులు తమ సత్తాచాటారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి చెందిన జయప్రకాష్ మొదటి స్థానం సాధించాడు. 5వ తరగతి చెందిన వర్షిత్ ద్వితీయ స్థానం, ఏడో తరగతి చెందిన బి జనార్ధన్ రుత్విక్ తతీయ స్థానం సాధించారు. అదేవిధంగా కన్సల్టేషన్ ప్రైజులు 38, గోల్డ్ మెడల్స్117, మెరిట్ సర్టిఫికెట్లు 347 సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమీక్ డీన్ శ్రీనివాసరావు, ప్రైమరీ ఇన్‌ఛార్జి, అమర వేణి, ఒలంపియాడ్ ఇన్‌ఛార్జి సుమతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు

క్యారీ గుంతలో ఈతకెళ్లి.. ఇద్దరు చిన్నారులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

తరలించారు.

పెద్దదోర్నాలలో విషాద ఛాయలు

పెద్దదోర్నాల ఇందిరా నగర్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు ఈత కోసం వెళ్లి విగతజీవులుగా మారడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు ప్రసన్న కుమార్ తండ్రి కొండెబోయిన గిరి వెంకట ప్రసాద్ రోజు కూలి. ఆయని ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు ప్రసన్న కుమార్ పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. మరో మృతుడు దూదేకుల వలి తండ్రి దూదేకుల లాలు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం బాడుగకు వెళ్లి ఇతర రాష్ట్రాల్లో ఉన్నాడు. ఆయన భార్య ఏడాది క్రితమే చనిపోయింది. కుమారుడు వలిని నాయనమ్మ దగ్గర ఉంచి చదివిస్తున్నాడు. పెద్దదోర్నాలలోని మండల పరిషత్ మొయిన్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈత కోసం వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో పెద్దదోర్నాల, యడవల్లి, ఐనముక్కల గ్రామాల ప్రజలు ఉలిక్కి పడ్డారు. తండోప తండాలుగా వెళ్లి చిన్నారుల మృతదేహాలను చూసి కంటనీరు పెట్టారు.

ఎమర్జెన్సీ ల్యాండింగ్ ట్రయల్ రన్ విజయవంతం

'మొదటిపేజీ తరువాయి)

పట్ల ఎస్‌పి సంతోషం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎస్‌యు 30, హెచ్‌ఎహెచ్ ఎడబ్ల్యుకెఎన్ 32, డోర్నియర్ ఎయిర్ క్రాఫ్ట్‌లతో ట్రయల్ రన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ట్రయన్ రన్ సందర్భంగా రన్‌వేకు ఇరువైపుల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైమానిక దళ అధికారులు విజయ్‌మీనన్, జెపి.యాదవ్, జాయింట్ కలెక్టర్ సిహెచ్. శ్రీధర్ , వైమానిక దళ అధికారులు, అడిషనల్ ఎస్‌పి విఠలేశ్వర్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వైపాలెంలో ఉత్కంఠ పోరే..!

(మొదటిపేజీ తరువాయి)

ఈనెల 6న యర్రగొండపాలెంలో సిఎం బహిరంగ సభ నిర్వహించాలని తలపెట్టారు. అనివార్య కారణాల వల్ల ఆ సభ రద్దయింది. ఎన్నికలల్లో ఎలాగైనా విజయం సాధించాలని వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పాటికే పార్టీకి దూరంగా ఉన్న అందరిని కలుపు కుపోతున్నారు. చిన్న, చిన్న సమస్యలుఉంటే వాటిని సైతం పరిష్కరిస్తున్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ వైసిపి కార్యాలయం ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గెలుపే ధ్యేయంగా టిడిపి...

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఎరిక్షన్‌బాబు ఊవ్విళ్లూరుతున్నారు. అందులో భాగంగానే టిడిపి నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎరిక్షన్‌బాబు ముందుకు సాగుతున్నారు. నేరుగా కార్యకర్తలు, నాయకుల గృహాలకు వెళ్లి పలకరించి తన విజయానికి సహకరించాలని కోరుతున్నారు. తాటిపర్తి చంద్రశేఖర్ సైతం ప్రతి గ్రామానికి వెళ్లి గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పోరు హోరా హోరీగా సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు: మార్కాపురం

ఓ.ఎస్. నెం: 413/2023

ఏలూరి లక్ష్మి శిరీష
రిప్రజెంటెడ్ బై హియర్ జి.పి.ఎ.
హోల్డర్ ఏలూరి ఈశ్వరరెడ్డి .... పిటీషనర్
వర్సెస్
తిరుమలరెడ్డి చెంచులక్ష్మమ్మ .... డిఫెండెంట్
టు,
డిఫెండెంట్ :
తిరుమలరెడ్డి చెంచులక్ష్మమ్మ
భర్త: లేట్ వెంకటరెడ్డి, వయసు: 72 సంII
హిందూ, గృహిణి, నివాసం: డోర్ నెం: 10-1058సి, జగదీశ్వరి థియేటర్ రోడ్డు, మార్కాపురం టౌన్.

పై నెంబరు దావాలోని వాది దావా పరిహారం నిమిత్తం అనగా దావా ప్లైయింట్ షెడ్యూలు ప్రాపర్టిని గూర్చి వాది పేర నీవు 10-6-1982వ తేదీన వ్రాయించి ఇచ్చిన స్వాధీన విక్రయ ఖరారు మీద నీ మీద పై నెంబరు దావాను దాఖలు చేసి యున్నది. సదరు స్వాధీన విక్రయ ఖరారు మేరకు నిన్ను రిజిష్టర్డ్ సేల్ డీడ్ వ్రాయించి ఇవ్వమని స్పెసిఫిక్ ఫర్ఫార్మెన్స్ నిమిత్తం దావాను దాఖలు చేసి యున్నది. ఇందు విషయమై నీకు దావా సమన్లు పంపగా అవి ముట్టని కారణము చేత ఈ పేపరు దావా సమను ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 28-03- 2024వ తేదీన వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించ్ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఎ.శ్రీనివాసరావు
అడ్వకేట్, మార్కాపురం
సెల్: **9248515151.**

పోయినవి

బొల్లినేని శ్రీదేవి W/o వెంకటేశ్వర్లు ఒంగోలు, కమ్మపాలెం నుండి ఆటోలో జిరాక్స్ షాపుకు వెళ్లుచుండగా మార్గ మధ్యలో ఇంటి స్థలం కాగితాలు పోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలపగలరు.

బొల్లినేని శ్రీదేవి, కమ్మపాలెం 3వలైన్, ఒంగోలు. 7997661333

దావా సమన్లు

మహారాజశ్రీ సంగారెడ్డి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం: 101/2023

బిట్వీన్:
లంకా భాస్కర రెడ్డి .....వాది
ఎదిరి
వనుకూరి మల్లారెడ్డి ...ప్రతివాది
టు,
వనుకూరి మల్లారెడ్డి, తల్లి.వనుకూరి శివ నాగేశ్వరమ్మ, C/o. జొన్నల జోతిర్మయి, మోదుకూరు గ్రామం, టిచుందూరు (మం), గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా.

పైనెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు సమన్లును ఈపేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.22-04-2024కి వాయిదావేసినారు. కావున సదరు వాయిదా రోజున ఉ.గం.10-30ని.లకు పైకోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ వకీలుద్వారా కాని హాజరై మీకుగల ఆక్షేవణలు తెలువుకొనవలెను. లేనిచో మీపరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:22-04-2024.

జి. ధనంజయ్, జి.డి. శశిధర్
వాది తరపు న్యాయవాదులు, డోర్.నెం.3-5-100, నారాయణగూడ, హైదరాబాద్,సెల్: 9440067467, 9966786319

గ్రామపంచాయతీ కార్యాలయము.
అమృతలూరు. అమృతలూరు మండలము. బాపట్ల జిల్లా

ఆర్.ఓ.సీ.07/2024. **టెండర్ నోటీసు.** తేదీ.18-3-2024

బాపట్ల జిల్లా అమృతలూరు మండలము అమృతలూరు గ్రామపంచాయతీ లోని ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా సామాన్లు సరఫరా చేయుట కొరకు సీల్డు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు గ్రామపంచాయతీ కార్యాలయము నందు 25-03-2025 తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు సీల్డ్ చేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు అప్పటికి హాజరు కాబడిన టెండర్ దారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూలు దాఖలా ధరావతు లు చెల్లించి రసీదులను టెండర్లకు జత చేయవలెను. ధరావతులను చెల్లించని టెండర్లను ఆమోదించబడవు. టెండర్లను తిరస్కరించుటకు లేదా ఆమోదించుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారం కలదు. ఇతర వివరములకు పంచాయతీ కార్యదర్శి వారిని కార్యాలయ పని వేళలలో సంప్రదించవచ్చును.

వ.నెం	వివరములు.	ధరావత్తు.
1.	2024-25 సం.నకు కరెంటు సామాన్లు సరఫరా చేయుటకు.	100.00 రూ.
2.	2024-25 సం.నకు ప్రజారోగ్య సామానులు సరఫరా చేయుటకు	100.00 రూ.
3.	2024-25 సం.నకు చేతి పంపు సామానులు సరఫరా చేయుటకు	100.00 రూ.
4.	2024-25 సం.నకు పి డబ్ల్యూ ఎస్ సామానులు సరఫరా చేయుటకు.	100.00 రూ.
5.	2024-25 సం.నకు స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుటకు.	100.00 రూ.
6.	2024-25 సంవత్సరమునకు టెండర్ పద్ధతి పై స్వీపరు గా పనిచేయుటకు 5 పోస్టులు. (01-04-2024 నుండ 31-3-2025) వరకు.	100.00 రూ.
7.	2024-25 సంవత్సరంనకు ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేయుటకు ఒక పోస్టు (1-04-2024 నుండి 31-03-2025) వరకు	100.00రూ.
08.	2024-25 సంవత్సరంనకు టెండర్ పద్ధతి పై ఎలక్ట్రీషియన్ గాపని చేయుటకు 1 పోస్టు. (01-04-2024 సం,, నుండి 31-03-2025)వరకు	100.00 రూ.
09.	2024-25 సం,,నకు టెండర్ పద్ధతిపై నైట్ వాచ్ మెన్ గా పనిచేయుటకు ఒక పోస్ట్ (01-04-2024 నుండి 31-03-2025) వరకు.	100.00 రూ.
10.	2024-25 సంవత్సరమునకు టెండర్ పద్ధతిపై పిడబ్ల్యూఎస్ పంపు ఆపరేటర్గా పనిచేయుటకు 1 పోస్ట్.(01-04-2024 నుండి 31-03-2025 వరకు)	100.00 రూ

గమనిక : గ్రామ పంచాయితీ నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు సి ఎఫ్ ఎం ఎస్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించబడును.

ఎన్.ఎల్.ఎం వెంకట కుమార్.
పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ అమృతలూరు.

ప్రకటన

మా క్లయింట్లు నిజాంపట్నం మండలం అధవల గ్రామం కాపరస్తులు 1,బడుగు మణికుమార్ S/o సుబ్రహ్మణ్యం 2, మనీషా D/o సుబ్రహ్మణ్యం 1-2 వారులు మైనర్లు అయినందున గార్డియన్ తల్లి బడుగు లక్ష్మీ తిరుపతమ్మ గారి తరపున తెలియ జేయునది.

మా మైనర్ క్లయింట్లుకు తల్లి గారైన లక్ష్మీ తిరుపతమ్మ గారికి మరియు వారి తండ్రి సుబ్రహ్మణ్యం గారికి ఏర్పడిన మనస్పర్ధలు పురస్కరించుకుని మా మైనర్ క్లయింట్లు ఎలాంటి ఆస్తి చెందకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ దిగువ షెడ్యూల్ దాకల ఆస్తులలో మా మైనర్ క్లయింట్లు కు జాయింట్ హక్కులు ఉన్నప్పటికీ వారి ఇరువురి సమ్మతులు లేకుండా మా మైనర్ క్లయింట్లు తండ్రి మరియు తాతగారు బడుగు సుబ్బారావు గార్ల ఈ దిగువ షెడ్యూల్ ఆస్తులను అమ్మడానికి ప్రయత్నం చేయు చున్నట్లు మా మైనర్ క్లయింట్లుకు తెలియ వచ్చినది. ఒకవేళ ఎవరైనా షెడ్యూల్ ఆస్తులు కొన్నప్పుడు మా మైనర్ క్లయింట్లు వాటి విషయమై దావా వేసి తగు పరిహారం పొందగలరని ముందుగా ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్

అయిటం నెం-1.
గుంటూరు డిస్టిక్ మంతెనవారిపాలెం సబ్ డివిజన్ బావాజీ పాలెం పంచాయతీ పరిధిలోని S.No.189 లో గల Ac. 0.65 సెంట్లు మాగాని భూమికి హద్దులు తూర్పు పంట కాలువ దక్షిణం బడుగు శ్రీనివాసరావు పడమర కారంకి గౌతమి ఉత్తరం బడుగు రమేష్ ఈ హద్దుల మధ్య A.C 0.65 సెంట్లు మాగాని భూమి.

అయిటం నెం-2.
గుంటూరు డిస్టిక్ మంతెన వారి పాలెం సబ్ డివిజన్ బాబాజీ పాలెం పంచాయితీ ఏరియా లోని S.No:198/4 లో గల AC. 0.25 సెంట్లు మాగాణి భూమికి హద్దులు తూర్పు సలీమా దక్షిణం బడుగు వెంకటరామయ్య, పడమర గాలి రాంబాబు, ఉత్తరం బడుగు పెద్ద సాంబయ్య ఈ హద్దుల మధ్య AC 0.25 సెంట్లు మాగా మాగాణి భూమి.

అయిటం నెం-3.
గుంటూరు డిస్టిక్ మంతెనవారిపాలెం సబ్ డివిజన్ బావాజీ పాలెం పంచాయతీ పరిధిలోని S.No.201/5 లో గల 10.1/2 సెంట్లు మాగాణి భూమికి హద్దులు తూర్పు బడుగు వెంకటేశ్వరమ్మ దక్షిణం యొక్క యానాది రావు పడమర లుక్క సుందర్రావు ఉత్తరం బడుగు సూర్యనారాయణ ఈ హద్దుల మధ్య AC 10.1/2 సెంట్లు మాగాణి భూమి.

అయిటం నెం-4.
గుంటూరు డిస్టిక్ మంతెనవారిపాలెం సబ్ డివిజన్ బాబాజీ పాలెం పంచాయితీ పరిధిలోని S.No. 201/6 లో గల AC:16.1/2 సెంట్లు మాగాణి భూమికి హద్దులు తూర్పు – శీలం సత్యవతి దక్షిణం బసుగు రామారావు పడమర క్రరీ యానాదిరావు. ఉత్తరం – బడుగు పెద్ద సాంబయ్య ఈ హద్దుల మధ్య AC No: 16.1/2 సెంట్లు మాగాణి భూమి.

అయిటం నెం-5.
గుంటూరు డిస్టిక్ మంతెనవారిపాలెం సబ్ డివిజన్ బావాజీ పాలెం పంచాయతీ పరిధిలోని S.NO. 257/1, లో గల AC: 0.54 సెంట్లు మాగాణి భూమి హదలు తూర్పు పంట కాలువ దక్షిణం మరక సాంబయ్య పడమర బడుగు ముత్తయ్య ఉత్తరం బడుగు వెంకటరామయ్య ఈ హద్దుల మధ్య AC 0.54 సెంట్లు మాగాణి భూమి.

అయిటం నెం-6.
గుంటూరు డిస్టిక్ మంతెనవారిపాలెం సబ్ డివిజన్ బావాజీ పాలెం పంచాయతీ పరిధిలోని S.NO 264/1 లో గల AC 1-01 సెంట్లు మాగాని భూమికి హద్దులు తూర్పు బండ బాబు దర్శనం బడుగు ఆదినారాయణ పడమర షేక్ మౌలాలి ఉత్తరం బడుగు వెంకటేశ్వర రావు ఈ హద్దుల మధ్య AC 1-01 సెంట్లు మాగాణి భూమి.

రేపల్లె.


అనగాని శ్రీనివాసమూర్తి
పిటిషనర్ తరపు న్యాయవాది
రేపల్లె.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సిఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రత్నం జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీకి చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. సిఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 221 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 218 మంది హాజరయ్యారు. రత్నం జూనియర్ కళాశాలలో 133 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 131 మంది హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్‌లు తెలిపారు. పామూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం రామస్వామి, మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసులు పరీక్షల చీఫ్ ఆఫీసర్లుగా, వీరభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ బాషా, లక్ష్మీ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సయ్యద్ ఖాదర్‌వలీ డిపార్టుమెంటల్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తించారు.

కనిగిరి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కనిగిరి మున్సిపాలిటీ, కనిగిరి రూరల్ పరిధిలో ఏడు కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గాలి, వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. కనిగిరి బాలికల ఉన్నత పాఠశాలలో 237 మంది విద్యార్థులు, బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది, సెయింట్ జోసెఫ్ 160 మంది, కంచర్లవారిపల్లి 131 కంచర్లవారిపల్లి ఏ సెంటర్ 150, కంచర్లవారిపల్లి బి సెంటర్ 131 విద్యార్థులు, చింతలపాలెం జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ 200 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు 144 సెక్షన్ విధించి దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూయించారు. పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షకు హాజరయ్యారు.



కనిగిరిలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పొదిలి: పొదిలిలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయినట్లు ఎంఇఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలో మొత్తం ఐదు కేంద్రాలలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి 1000 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఈసారి ప్రభుత్వం కొత్తగా క్యూఆర్ కోడ్ విధానం ప్రవేశపెట్టిందని, దీని వలన ప్రశ్నపత్రాలు లీక్ అయ్యే అవకాశం లేదన్నారు. ఒకవేళ అలాంటిది ఏదైనా జరిగితే అది ఏ పరిక్ష కేంద్రంలో ఏ విద్యార్థి నుంచి బయటకు వచ్చిందనేది అత్యంత సులువుగా తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్, కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 673 మంది విద్యార్థులకు గాను 655 మంది విద్యార్థులు హాజరవగా 18 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖధికారి బి మస్తాన్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 269 మందికి గాను 254 మంది, వసంత జూనియర్ కాలేజీలో 250 మందికి గాను 249 మంది, రవీంద్ర ఉన్నత పాఠశాలలో 154 మందికి గాను 152 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మూడు సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

కొమరోలు: కొమరోలు మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు వీటిని నిర్వహిస్తున్నట్లుగా ఎంఇఒ వెంకటరత్నం తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు పరీక్షా కేంద్రాలలో 502 మందికి గాను 16 మంది గైర్హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామని ఎంఇఒ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 198 మందికి 185 మంది మాత్రమే హాజరయ్యారు. నరేష్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 100 మందికి 98, సర్వైట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 204 మందికి 203 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు.

కొండపి: కొండపి మండలంలో పదో తరగతి పరీక్షకు 593 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా అందులో 583 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో సురేఖ తెలిపారు. కొండపి లోని గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాఠశాల, చాణక్య కాలేజీ వద్ద తమ సిబ్బందితో బందోబస్తు ఎస్ఐ ఎం కృష్ణబాజిబాబు సిబ్బంది నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొదటి రోజు సజావుగా పరీక్ష సాగింది.

పుల్లలచెరువు: మండలంలోని పదో తరగతి పరీక్షలు మొత్తం 427 మంది రాస్తున్నారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 415 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది పరీక్షకు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారులు శ్యాముల్ జాన్, ఎంజె ఇందిరా ప్రసాద్ తెలిపారు. మండలంలోని విద్యార్థులందరూ పదో తరగతి పరీక్షలు క్రమశిక్షణ, పట్టుదలతో రాసి మండలంలోని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని వారు కోరారు.



పార్టీలో చేరిన వారితో ఉగ్ర నరసింహారెడ్డి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలంలోని కోటతిప్పల గ్రామానికి చెందిన 9 కుటుంబాలు, రసీదుపురంలో నాలుగు కుటుంబాలు, తిమ్మారెడ్డిపల్లిలో ఏడు కుటుంబాలు, మహమందాపురంలో రెండు కుటుంబాలు, ముప్పలపాడు, కిచ్చంపల్లి గ్రామాలకు చెందిన ఐదు కుటుంబాలు, వైసిపికి చెందిన 27 కుటుంబాలు మాజీ శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసిపి అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారని, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ నాయకులు మాయమాటలు చెప్పి గద్దినెక్కారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి తమకు మాయమాటలు చెప్పి గత ఎన్నికలలో ఓట్లు వేయించుకొని వదిలేశారని, మాట తప్పను మడతిప్పను అన్న జగన్మోహన్‌రెడ్డి తమ గ్రామాల అభివృద్ధిలో మాట తప్పారు.. మడమ తిప్పారని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే తమ భవిష్యత్తు ఉంటుందని గ్రహించి పార్టీలో చేరామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, కుందురు నారాయణరెడ్డి, ఎంపిటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, దోసపాటి బ్రహ్మం గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు శ్యామల వెంకటేశ్వర్లు, రెడ్డెం తిరుపతిరెడ్డి, కోటపాటి శేషయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, గాయం వెంకట సుబ్బయ్య, ఎర్రయ్య మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15 కుటుంబాలు టిడిపిలో చేరిక

అర్ధవీడు: మండల తెలుగుదేశం అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు గిద్దలూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పి అశోక్ నాయక్, పి రాజు నాయక్, మౌలాలి, ఎం పెద్ద సుబ్బరాయుడు, ఎం చిన్న సుబ్బరాయుడు, ఎం మల్లయ్య మహబూ, మదర్సా బి ఏషేబ్, చిన్న రాజయ్య, రాజారావు, బి ఆంజనేయులు యాదవ్, ఆసుపల్లె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పెద్దదోర్నాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల భవనంలో వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ జగనన్న సింగిల్‌గానే పోటీ చేస్తున్నారని తెలిపారు. అయితే ఆయన్ను తట్టుకునే ధైర్యం లేక టిడిపి, జనసేన, బిజేపీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్ని కూటములు కలిసి పోటీచేసినా జగనన్న గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్, సర్పంచ్ చిత్తూరి హారిక, నాయకులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, అబ్దుల్ మజీద్, రసూల్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, పవన్‌కుమార్, వెంకట్రామయ్యతో పాటు మండంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తాటిపర్తి

టీడీపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా సమన్వయంతో కృషి చేస్తామని టీడీపీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ అన్నారు. సోమవారం ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పయ్యావుల ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మండలంలో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించారు. ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుకు మండలం నుంచి మంచి మెజార్టీ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓబులు, టిడిపి నాయకులు బివి సుబ్బారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని రఘురాం ఆయిల్ కంపెనీ సర్వీస్ రోడ్డు సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా కుప్పం గ్రామానికి చెందిన జగదీష్, జి గోవిందరాజులు అనే వ్యక్తులు వ్యాపారం చేస్తూ ఉంటారు. అద్దంకి నుంచి ఒంగోలు వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మద్దిపాడు రఘురాం ఆయిల్ మిల్లు దగ్గరకు రాగానే నేషనల్ హైవే సర్వీస్ డివైడర్‌ను అతివేగంతో బలంగా ఢీకొనడంతో జగదీష్ బాబు(24) అక్కడికక్కడే మృతి చెందగా, గోవిందరాజులు తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా ఒంగోలు ప్రభుత్వం హాస్పటల్ తరలించినట్లు స్థానిక ఎస్ఐ వి మహేష్ తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పొదిలి



మండలంలోని తలమల గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే పంచాయతీ ఫిరదౌస్ నగర్‌కు చెందిన షేక్ బాబా సాహెబ్, మస్తాన్‌వలి, నాయబ్ రసూల్‌లు ఒంగోలు వైపు వెళ్తున్న బైక్‌పై ప్రయాణిస్తున్న ఒంగోలు వైపు నుంచి పొదిలి వైపు వస్తున్న టిప్పర్ వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఢీకొట్టిన టిప్పర్ ఆగకుండా వెళ్లిపోవడంతో దానిని గుర్తించే అవకాశం లేకుండాపోయింది. సంఘటన జరిగన వెంటనే గ్రామస్తులు 108కి సమాచారం ఇచ్చారు. అది ఎంతకూ రాకపోవడంతో క్షత గాత్రులు చాలాసేపు రోడ్డు మీదనే ఉండిపోయారు. గ్రామ స్తుల చొరవతో వారిని ఆటోలో పొదిలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆపకుండా వెళ్లిపోయిన టిప్పర్‌పై క్షతగాత్రుల బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో..

పారిశుధ్య కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గిద్దలూరు నగర పంచాయతీలో తాత్కాలిక పారిశుధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న కొమ్ము నూరి భాస్కర్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా పట్టణం లోని ఫ్లెక్సీలను, ఇతర బోర్డులను తొలగించా లని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. పారిశుధ్య కార్మికుడు కొమ్మునూరి భాస్కర్ పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తున్న సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యుత్ షాక్‌కు గురైన కొమ్మునూరి భాస్కర్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. కొమ్మునూరి భాస్కర్ వైద్య ఖర్చులు తామే భరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు తెలిపారు.

భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: ఆవులయ్య, సీఐటీయు నాయకులు

ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తూ విద్యుత్ షాక్ కు గురై తీవ్ర గాయాలైన పారిశుధ్య కార్మికుడు కొమ్మునూరి భాస్కర్‌ను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని అతని కుటుంబానికి భరోసా ఇవ్వాలని సీఐటీయు నాయకులు ఆవులయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి నాగయ్య, ఎం మురళి కోరారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

◆ జిల్లాలో 630 మంది గైర్హాజరు ◆ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్


పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి - బాపట్ల

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేవరకు తనిఖీ బృందాలు తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాయి. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా డీఈఒ కె నారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య సిబ్బందిని అత్యవసర ఔషధాలతో సిద్ధంగా ఉంచారు. త్రాగునీటి సౌకర్యం కల్పించారు. పరీక్ష హాల్లో గాలి, వెలుతురు ఉండే ఏర్పాట్లు చేశారు.

630మంది విద్యార్థులు గైర్హాజరు

జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో 108పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు నిర్వహించిన తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు సంబంధించి 17436మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16806మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈఒ కె నారాయణరావు తెలిపారు.

తనిఖీ బృందాల విస్తృత పర్యటన

పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసేవరకు తనిఖీ బృందాలు వెన్నంటి ఉన్నాయి. కలెక్టర్ పి రంజిత్‌బాషా పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు రవీంద్రనాధ్‌రెడ్డి జిల్లాలోని ఐదు సెంటర్లలో తనిఖీలు చేశారు. డిఇఒ కె నారాయణరావు నాలుగు సెంటర్లలో తనిఖీలు చేశారు. వీరితోపాటు డిప్యూటీ డీఈఒలు ఒక్కొక్కరు నాలుగు పరీక్షా కేంద్రాలు చొప్పున తనిఖీచేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో నియమించిన సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలను ముమ్మరం చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

పదవతరగతి పరీక్షలు జరిగే 108పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లు, ప్రింటర్లను అధికారులు ఆదేశాల మేరకు మూసివేశారు. పరీక్ష ప్రారంభమైనప్పటికీ నుంచి ముగిసేవరకు పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశారు.

వేటపాలెం : మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలు నిర్వహించినట్లు ఎంఇఒ ఎంవి సుబ్బయ్య, పురుషోత్తం తెలిపారు. తొలి రోజు తెలుగు పరీక్షకు 1134మందికి గాను 34మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎస్ఐ జి సురేష్ బందోబస్తు నిర్వహించారు.

చీరాల : పదవ తరగతి పరీక్షలను ఎంతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. సోమవారం నుండి ప్రారంభమైన పరీక్షలు తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. చీరాల 11, వేటపాలెం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.



వేటపాలెంలో విద్యార్థులను పరీక్షిస్తున్న పోలీసులు


చీరాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

యువజన అధ్యక్షుడిగా రాజ్‌పాల్

ప్రజాశక్తి - రేపల్లె

వైసిపి యువజన విభాగం పట్టణ అధ్యక్షునిగా ఆలా రాజ్‌పాల్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాజ్‌పాల్ మాట్లాడుతూ పార్టీ కోసం శక్తి వంచన లేకుండా విధేయతగా శ్రమిస్తానని అన్నారు. ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిలో నియమించిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసిపి అభ్యర్థి డాక్టర్ గణేష్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, వైసిపి పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు చిత్రాలు ఒబేద్, మున్సిపల్ చైర్ పర్సన్ కట్ట మంగ సుబ్బారావు, వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.


మోపిదేవిని కలిసిన రాజ్‌పాల్


నోవా క్రిస్టియన్ హాస్పిటల్ ప్రారంభిస్తున్న డాక్టర్ అజయ్

నోవా క్రిస్టియన్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని హరిప్రసాద్ నగర్లో ఆర్‌ఓబి వంతెన వద్ద నోవా క్రిస్టియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏపీ స్టేట్ మైనార్టీ వైస్ చైర్మన్ కమిషన్ జాషువా డానియల్ ప్రత్యేక ప్రార్థనతో ప్రారంభించారు. వైద్యశాల అధినేత డాక్టర్ నోవా అజయ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో తాను ఈ హాస్పిటల్ నెలకొల్పినట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో వైద్యం ఖరీదైందని అన్నారు. ప్రైవేటు వైద్యశాలలు పేదలకు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. చీరాల పరిసర ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో హాస్పటల్లో ఉచిత ఓపిని అందుబాటులో ఉంచామని అన్నారు. పరీక్షలు, ఆపరేషన్లు, ఇతర వైద్యం తక్కువ ఖరీదుతోనే పేదలకు వైద్యం చేస్తామని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దైవ సేవకులు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.


యద్దనపూడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్ఐ జివి చౌదరి ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ పోలీసులు సోమవారం కావాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చౌదరి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలని అన్నారు. ఎవరైనా వివాదాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. వివాదాలు, గొడవలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు తాము ఉన్నామనే ధైర్యం కల్పించేందుకే కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రలోభాలకు లొంగ కుండా స్వతంత్రంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. కవాతులో యద్దనపూడి పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

డాక్టర్ పీవీ ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

ఐఎంఎ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

ప్రజాశక్తి - చీరాల

వైద్య రంగంతోపాటు సామాజిక సేవ, సాంస్కృతిక సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన డాక్టర్ పోలవరపు వెంకటప్రసాద్ సేవలు మరువలేనివి పలువురు వైద్యులు అన్నారు. డాక్టర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన హఠాన్మరణం బాధాకరమని ఐఎంఎ వైద్యులు పేర్కొన్నారు. స్థానిక ఐఎంఏ హాలులో డాక్టర్ పివి ప్రసాద్ సంస్మరణ సభ ఐఎంఎ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. డాక్టర్ పివి ప్రసాద్ 1959 అక్టోబర్ 27న పోలవరపు జగదీశ్వరరావు, అనసూయ దంపతులకు ఏలూరులో జన్మించారు. ఆయన తండ్రి జగదీశ్వరరావు స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. డాక్టర్ ప్రసాద్ తన పాఠశాల విద్యను ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల్లో, ఇంటర్మీడియట్ విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల్లో చదివారు. 1976లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో ఎంబిబిఎస్, 1983లో గుంటూరు వైద్య కళాశాల్లో గైనకాలజీలో పిజి చదివారు. జగ్గయ్యపేట, తోట్లవల్లూరు, మైలవరంలో ప్రభుత్వ వైద్యశాలల్లో కొంతకాలం పనిచేసిన తరువాత 1988లో 30 పడకలతో చీరాలలో శ్రీ సరస్వతి నర్సింగ్ హోమ్‌ను ప్రారంభించారు. 35ఏళ్ల నిరంతరాయంగా వైద్య సేవలో దాదాపు 30వేల మందికి కాన్పులు చేశారు. 2017లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పేద, నిరుపేద గర్భిణీ స్త్రీలకు ఆయన చేసిన అపారమైన సహాయానికి ప్రకాశం జిల్లా కలెక్టర్ నుండి మెరిటోరియస్ సర్టిఫికేట్ అందుకున్నారు. ఆయన డాక్టర్ గిరిజా కుమారిని వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడు డాక్టర్ జగదీష్ వెల్లూరులోని సిఎంసీ వైద్య కళాశాలలో గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కోడలు డాక్టర్ హర్షవీణ ఎండి రేడియాలజిస్ట్‌గా వేలూరు సిఎంసీ వైద్యశాలలోనే పనిచేస్తున్నారు. వైద్యవృత్తి నేపథ్యం కలిగిన డాక్టర్ పివి ప్రసాద్ సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో విభిన్న ఆసక్తులను ప్రదర్శించిన బహుముఖ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిని కొనియాడారు. కళలు, సంస్కృతిని ప్రోత్సహించడానికి సహకారం అందించారని అన్నారు. సామాజిక, సేవా సంస్థల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. చైతన్య భారతి (త్యాగరాజ ఆరాధనోత్సవాలు) కమిటీ అధ్యక్షుని గాను, కళాంజలి, లిటరల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, వైఏ ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి కమిటీ, అధ్యక్షుడు, ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్, ప్రెసిడెంట్‌గా, విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజ్ గవర్నింగ్ బాడీ సభ్యుడు, చీరాల ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా, చీరాల రోటరీ క్లబ్, సభ్యునిగా అధ్యక్షుడు, వైకుంఠపురం శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పి శ్రీకాంత్, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, డాక్టర్ భవాని ప్రసాద్, డాక్టర్ రామకృష్ణ హనుమాన్, డాక్టర్ సైదులు చౌదరి, డాక్టర్ అనీల్ చౌదరి, డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, డాక్టర్ గోరంట్ల రాజేష్, డాక్టర్ పాల్, డాక్టర్ ముద్దన నాగేశ్వరావు, డాక్టర్ రాజు పాల్గొన్నారు.



ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎంఎ నాయకులు

ఢిల్లీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

సీనియర్ జాతీయ మినీ గోల్ఫ్ ఛాంపియన్ షిప్‌లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. మినీ గోల్ఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్ర మినీ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగపూర్లో 9వ సీనియర్ నేషనల్ మినీ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ జట్టు తరపున ఏడుగురు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మీరందరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థి ఎం అఖిల్ సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజిత పతకాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అఖిల్ సాయి అస్సాం, విదర్భ, ఛత్తీస్‌ఘడ్ జట్లపై గెలిచి ఫైనల్లో స్థానం పొందాడు. వ్యక్తిగత ఈవెంట్లో కేరళ, మధ్యప్రదేశ్ జట్లులపై గెలిచి రజిత పథకాన్ని కైవసం చేసుకున్నట్లు కోచ్ షోయబ్ అహ్మద్ తెలిపాడు. జాతీయ స్థాయిలో పతకాన్ని సాధించిన అఖిల్ సాయిని స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ గణేష్‌రెడ్డి, సాయి గణేష్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఏ ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నర్గీస్ క్వాజి, కోచ్ షోయబ్ అహ్మద్ అభినందించారు.



గోల్ఫ్‌లో పతకాలు సాధించిన ఢిల్లీ స్కూల్ విద్యార్థులు

ప్రైవేట్ హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రులు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు స్టాఫ్ నర్సుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం)లో నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ .విజయమ్మ సోమవారం విలేకరులకు తెలిపారు . అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు క్లినిక్,ల్యా బ్ , స్కానింగ్ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను ఆయుష్మాన్ భారత్ మిషన్ లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు కాని కొత్త సెంటర్ల రిజిస్ట్రేషన్లు , రెన్యువల్ వంటి ప్రక్రియ నిలిపివేస్తామని ఆమె తెలిపారు.


డిఎంహెచ్ఒ విజయమ్మ

ప్రజాశక్తి 5
మంగళవారం 19 మార్చి 2024

ఎన్నికల నియమావళిని పాటించాలి

రిటర్నింగ్ అధికారి కుమార్

ప్రజాశక్తి-కొండపి

రాజకీయ పార్టీ నాయకులు జరగనున్న సార్వత్రిక ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ కుమార్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం కొండపిలోని తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో, రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల 16 మధ్యాహ్నం 3 గంటల నుంచి కోడ్ అమలులోకి వచ్చిందని, ప్రతిఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని కోరారు. ఓట్లు తొలగింపు, పెండింగ్‌లు ఈ నెల 16 నుంచే నిలిపివేసినట్లు తెలిపారు. కొత్త ఓటర్ల చేర్పులకు సంబంధించి ఫారం-6 ఏప్రిల్ 15వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

హోం ఓటింగ్‌కు అవకాశం

గ్రామాలలో 85 సంవత్సరాలు పైబడి ఉండి పోలింగ్ కేంద్రాలకు రానివారికి, అలాగే అంగవైకల్యం కలిగి పోలింగ్ కేంద్రాలకు రాలేనివారికి హోం ఓటింగ్ కార్యక్రమం ద్వారా నేరుగా వారి ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్‌కు ఓటర్లు



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్‌వో ఎ కుమార్‌ల

ఎంతమంది ఉన్నారో బిఎల్‌వోల ద్వారా సర్వే చేస్తున్నారని అన్నారు. బిఎల్‌వోలు సర్వే చేసిన తరువాత నిజమైన అర్హులను గుర్తించి వారికే హోం ఓటింగ్ అవకాశం కల్పిస్తామని తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఎన్నికలకు సంబంధించిన ఏ సమస్య అయినా ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు నేరుగా నియోజకవర్గ కేంద్రం కొండపిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని ఆర్‌వో తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నెంబరు 9032319379, ల్యాడ్ నెంబర్ 08598 294717 నెంబర్లలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

కొనకనమిట్ల: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలో ఎన్నికల నియమావళిని విధిగా అమలు చేయాలని ఎంపీడీవో సుగుణమ్మ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో విఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల నియమావళిపై జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే ప్రసార బోర్డులను, ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. గృహాలు, వ్యాపార దుకాణాల దగ్గర పార్టీకి సంబంధించిన ఫోటోలు, సమాచారం ఉన్న, ఆ గృహ, దుకాణ యజమానుల నుంచి అడ్వర్టయిజ్‌మెంట్ కింద పంచాయతీ కార్యదర్శులు నిధులు వసూలు చేయాలని సూచించారు. తహశీల్దారు షాజిదా మాట్లాడుతూ రాజకీయంగా రెచ్చగొట్టే విధమైన తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్య పర్యవేక్షకులు, విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుపాకుల వెంకటయ్యకు కుందురు నివాళి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట వైసీపీ సీనియర్ నాయకులు, బేస్తవారిపేట కళ్యాణ్ థియేటర్ యజమాని తుపాకుల వెంకటయ్య ప్రార్థివ దేహాన్ని సందర్శించిన వైసిపి గిద్దలూరు నియోజకవర్గ అభ్యర్థి, మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి నివాళులు అర్పించారు. ఆయన వెంట కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, బేస్తవారిపేట వైసీపీ నాయకులు ఉన్నారు.



వెంకటయ్యకు నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి తదితరులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని భూసురపల్లిలో ఎన్నారై తక్కెళ్లపాటి రమేష్ ఆధ్వర్యంలో సంతనూతల పాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ సమక్షంలో దళిత వాడకు చెందిన 50 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. సోమవారం రాత్రి మండలంలోని భూసుర పల్లిలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి కూటమిదే విజయమని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గం లోని అన్ని గ్రామాలలో పలు పనులు చేపట్టి అభివృద్ధి పథంలో నడుపుతానని అన్నారు. టిడిపి అభివృద్ధికి కేరాఫ్ అయితే, వైసిపి అవినీతికి కేరాఫ్‌గా మారిందని అన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే చేపట్టే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రాంబ్రహ్మం, రాఘవరావు, వేల్పుల శ్రీను, మాజీ సర్పంచ్ బత్తుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అరక స్వాములు రాయపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విజయకుమార్ సమక్షంలో టిడిపిలో చేరిన కార్యకర్తలు

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా కృషి చేయాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆర్యవైశ్యులు అందరూ కలిసికట్టుగా పనిచేసి వైసీపీ విజయానికి కృషి చేయాలని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆర్యవైశ్యులను కోరారు. సోమవారం పట్టణంలోని పెండ్యాల కిరణ్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో కుందురు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని, మరోసారి సేవ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తే గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు బాదం వెంకటేశ్వర్లు, అన్నా రమణ, బాదం గోపాల్, గర్రె చిరంజీవి పాల్గొన్నారు.



ఆర్యవైశ్యులతో కుందురు నాగార్జునరెడ్డి

వైసిపి కార్యకర్తకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి కార్యకర్త యనమద్ని కిశోర్‌ను సోమవారం వారి నివాసంలో కలిసి మంత్రి సురేష్ పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాదపడుతున్నట్లు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం కొండపిలో అనారోగ్యంతో మరణించిన మాజీ సైనికుడు యనమద్ని వెంకటేశ్వర్లు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, బొక్కిసం సుబ్బారావు, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ప్రజల్లో సంతోషం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ రెండో వార్డు పరిధిలోని బీసీ కాలనీలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ గెలుపు కోసం ప్రచార కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ శ్రేణులతో కలిసి సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించారని, దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ను ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తమ్మినేని సుజాతరెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి సత్యవతి, శ్రీరామ్ సతీష్, దేవరాజ్, వైసీపీ నాయకులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, పిచ్చిరెడ్డి, నాయిబ్ రసూల్, ఆదాం, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, యోగిరెడ్డి, కొండలరావు, కంటు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎస్‌సి నాయకులు

దళిత నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పాలకేంద్రం సమీపంలో ఉన్న లింగారెడ్డి ఫంక్షన్ హాలులో సోమవారం నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల ఎస్‌సి నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమావేశానికి రెండు మండలాల ఎస్సీ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై నిలిచి వైసిపిని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, సంతనూతలపాడు నియోజకవర్గంలో మేరుగు నాగార్జునను గెలిపించుకుందామని ముక్తకంఠంతో అన్నారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు ఎంపీపీ బి విజయ, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎన్‌జీ పాడు జేసీఎస్ కన్వీనర్ కే సుధాకర్, కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, ఎనికపాడు ఎంపీటీసీ ఎల్ నాగేశ్వరరావు, ఆర్‌ఎల్ పురం సర్పంచ్ పి రమణమ్మ, నాయకులు నూకతోటి ఈశ్వరరావు, ఎం అమరనాథ్, దమ్మాల శ్రీనివాసరావు, పి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మొదటిసారి దర్శికి చేరిన రైలు బండి

దర్శికి చేరిన 'రైలు'

ప్రజాశక్తి-దర్శి

నడికుడి కాళహస్తి రైల్వే లైన్‌లో దర్శి వరకు పూర్తయిన సందర్భంగా మొదటిసారి రైలు బండి సోమవారం దర్శికి చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దర్శికి రైలు రావడంతో ప్రజలందరూ ఆనంద వ్యక్తం చేస్తున్నారు. మొదటిసారి రైలు వచ్చిన సందర్భంగా చూడటానికి ప్రజలు పెద్దఎత్తున రైలు వద్దకు వెళ్లి సంతోషం వ్యక్తం చేశారు.

ముండ్లమూరు ఎస్‌ఐగా ఆంజనేయులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు ఎస్‌ఐగా పి ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వై నాగరాజుకు సిఐగా పదోన్నతి రావడంతో ఐజి ఆఫీసుకు వెళ్లారు. ఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందు వలన మండలంలోని రాజకీయ నాయకులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. అధికారులు, ప్రజల సహకారంతో శాంతియుత నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌కో ఎఇగా బ్రహ్మం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈగా ఎస్‌వి బ్రహ్మం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తాళ్లూరు ఏఈగా పనిచేస్తూ బదిలీపై ముండ్లమూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా సిబ్బంది సహకారంతో నిర్వహిస్తానని మండల ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు.



తుపాకుల వెంకటయ్యకు నివాళులర్పిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

ముత్తుముల నివాళి

ప్రజాశక్తి-బేస్తవారిపేట: పట్టణంలో నివాసం ఉంటున్న గిద్దలూరు నియోజకవర్గ కాపు సంఘం సలహాదారులు తుపాకుల వెంకటయ్య అకాల మృతి పట్ల టీడీపీ గిద్దలూరు నియోజకవర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి నివాళులర్పించారు. సోమవారం ఆర్‌కె నగర్‌లో వెంకట య్య స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ నాయకులు సొరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి కాపు నాయకులు దుత్తా బాలఈశ్వరయ్య నివాళులు అర్పించారు.

మార్కాపురంలో ఎస్‌టిల ధర్నా

మార్కాపురం: తమకు దక్కాల్సిన సంక్షేమ ఫలాలను అనర్హులు గద్దల్లా తన్నుకు పోతున్నారని త్రిపురాంతకం మండలంలోని ఎస్టీలు కొందరు ఆరోపిస్తున్నారు. కొందరు అవినీతి అధికారుల అక్రమాలతో తమకు అన్యాయం జరుగుతోందని, ఈ అక్రమాలకు కారణమైన అధికారులను, తమకు దక్కాల్సిన రిజర్వేషన్‌లను కాజేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎరుకలు, యానాదులు, సుగాలీలు, చెంచులు పాల్గొన్నారు. ఆందోళనకు నాయకత్వం వహించిన ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు చెందాల్సిన ఫలాలు అనర్హుల రాకతో దక్కడం లేదన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డిఒ రవీంధర్

ఎన్నికల్లో సెక్టర్ అధికారులే కీలకం

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పని కీలకమైనదని బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సెక్టార్ అధికారులకు ఈవీఎం, వివిపిటి, సియు అండ్ బియు పని విధానం, పోలింగ్ సందర్భంగా ఈవీఎం పని విధానంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. అందుకు ఈ శిక్షణ, అవగాహన దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు ఎఇఆర్‌ఓ సిహెచ్ సుబ్బయ్య, మార్టూరు ఎఇఆర్‌ఓ కె సంధ్యశ్రీ, యద్దనపూడి ఎఇఆర్‌ఓ వై నాగరాజు, కారంచేడు ఎఇఆర్‌ఓ మెహర్ బాబు, ఇంకొల్లు ఎఇఆర్‌ఓ ఎం ప్రమీల, చిన్నగంజాం ఎఇఆర్‌ఓ జివిఎస్ ఫణింద్ర బాబు, పర్చూరు ఎన్నికల డిటి పి సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఎంపి సురేష్‌ను కలిసిన పర్చూరు ఎస్‌సి నాయకులు

ఎంపీని కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి - పర్చూరు

ఉద్దండిరాయునిపాలెంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ సభ్యులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు నందిగం సురేష్ బాబును పర్చూరు నియోజకవర్గ దళిత నాయకులు, పర్చూరు ఎస్సి సెల్ అధ్యక్షులు కట్టా రత్నరాజు, కూరాకుల ఇస్సాకు బాబు, జిల్లా అధ్యక్షులు మైలా చిన్న నాగేశ్వరరావు, కొణతం సిరిల్, బండి రాంబాబు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సైపర్‌వైజర్ వదన కుమారి

పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

గర్భవతులు, పిల్లలు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఐసిడిఎస్ ఇంకొల్లు సెక్టార్ సూపర్‌వైజర్ వదన కుమారి సూచించారు. పోషణ పక్వాడ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవటం వలన పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చని అన్నారు. అంగన్‌వాడీ అందించే బాలామృతం, పాలు, గుడ్లు, వైఎస్ఆర్ కిట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అంజమ్మ, పద్మ, తల్లులు పాల్గొన్నారు.

మోడీని కలిసిన జనసేన నేత

ప్రజాశక్తి - పర్చూరు



మోడీని కలిసిన అనిల్‌కుమార్

చిలకలూరిపేట దగ్గర బొప్పూడి గ్రామం నందు జరిగిన ప్రజాగళం సభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోడీని హెలి ప్యాడ్ వద్ద పర్చూరు జనసేన నేత, ఆంధ్రా సెంట్రల్ జోన్ ఎన్నికల కన్వీనర్ ఆలా అనీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసిపి తాయిలాలకు ఆశ పడొద్దు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రజాదానంతో వేతనాలు పొందే వాలంటీర్లు, అంగన్‌వాడిలు, ఆశ వర్కర్లు వైసిపి అందించే తాయిలా లకు ఆశపడవద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా కోరారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవ స్థానంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల వేతనాలు పెంచా లని రోజుల తరబడి ఆందోళనలు చేసినప్పటికీ అణిచివేసే ప్రయత్నం చేశారే తప్ప ఎలాంటి హామీ ఇవ్వలేదన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. నిరుద్యోగత పెరిగిపోయి పెద్ద పెద్ద చదువులు చదివిన వారు సైతం ప్రభుత్వం అందించే రూ.5వేల వేతనానికి వాలంటీర్లుగా చేరి పని చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగం రూపుమా పేందుకు కనీసం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కూడా సరైన విధానంతో చర్యలు చేపట్టలేదని అన్నారు. రానున్న ఎన్ని కల్లో టిడిపి గెలుపొందుతుందని అన్నారు. వాలంటీర్లు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు తగిన రీతిలో ఉద్యోగ భద్రత కల్పిస్తామని అన్నారు. వేతనాలు పెంపుదల చేసే విధంగా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని తెలిపారు. వాలంటీర్లు వైసిపి ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నట్లు గుర్తిస్తే టిడిపి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఫొటోలతో సహా సేకరించి పంపించాలని కోరారు. వీటిని ఎన్నికల కమిషనర్‌కు పంపించి నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈపాటికే వాలంటీర్లు ఏ పార్టీకి అనుకూలంగా వ్యవహరించరాదని, ఎన్నికలకు దూరంగా ఉండాలని కోర్టు నుండి ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. ఉపేక్షిస్తే చర్యలు తప్పవన్న విషయాన్ని గుర్తుంచు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కనపర్తి సుందర్రావు, ఎడ్ల జైశీలరావు, వై కరుణ శ్రీనివాసరావు, కంభం సుధీర్, ఆతిన బసవ పున్నయ్య, జంగం సాంసన్, టైలర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి విధ్వంస పాలనకు చివరి ఘడియలు

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

చిలకలూరిపేట - బొప్పూడిలో జరిగిన టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమి ప్రజాగళం సభకు హాజరైన ప్రజలకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి విధ్వంస పాలనకు చివరి గడియలనేందుకు సభకు హాజరైన జనస్పందనే నిదర్శనమని అన్నారు. వంద ఎకరాలకుపైగా సభకు ఏర్పాటు చేసిన స్థలం నిండి పోయి, జాతీయ రహదారిపై 12కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ నిలిచిపోయి మరో మూడు రెట్లు ప్రజలు బయటే ఉండిపోయారని అన్నారు. తమ సభకు జనసంద్రం జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకతకు సంకేతమని సాక్షాత్తూ ప్రధాని వ్యాఖ్యానించటం గమనార్హమని అన్నారు. ప్రజాగళం సభ విజయంతో తాడేపల్లి ప్యాలెస్‌కు బీటలు వారాయని అన్నారు. రానున్న ఐదేళ్ల నవ్యాంధ్ర భవిష్యత్తుకు చాలా కీలకమని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ తోడ్పాటుతో రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని అన్నారు. కేంద్రంలో మూడోసారి ఏర్పడనున్న ఎన్డీఎ ప్రభుత్వంతో పాటు తాను కూడా అండగా ఉంటానని ప్రధాని హామీ ఇవ్వటం రాష్ట్ర ప్రజలకు ఎంతో ఊరట, సంతోషాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తుందని అన్నారు.

ఎన్నికల విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి - చీరాల



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వ రరెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల్లో ఊరూరా జన విజ్ఞానం, సామాజిక శాస్త్రాలపై అవగాహన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడా రు. సమావేశానికి ఎస్ఎంఎల్‌జి కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. రాజ్యాంగం గురించి మాట్లాడారు. రాజనీతి శాస్త్ర పూర్వ అద్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ జి ఎజ్రా రాజ్యాంగ నిర్మాణం రాజనీతి అంశాలపై వివరించారు. భారత రాజ్యాంగం, సర్వసత్తాక ప్రజాస్వామ్యం, సామ్యవాద, సెక్యులర్, రిపబ్లిక్ అని అన్నారు. చీరాలలో ఓటరు విజ్ఞానంపై వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మల్లెల రాజ్ కుమార్, పుష్పరాజు పాల్గొన్నారు.

ఎంపీ సురేష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - చీరాల



ఎంపీ సురేష్‌ను సత్కరిస్తున్న వైసీపీ నాయకులు

రానున్న ఎన్నికల్లో సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాపట్ల పార్లమెంట్ వైసిపి అభ్యర్థిగా నందిగం సురేష్‌ను మరోసారి ప్రకటించడం పట్ల చీరాల వైసీపీ యువత ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయన స్వగృహంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యాతం మేరీ బాబు ఆధ్వర్యంలో వైసీపీ యువకులు గజమాలతో సత్కరించారు. చీరాల ఎంఎల్ఎ అభ్యర్థి కరణం వెంకటేష్ బాబు, పార్లమెంటు అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడిచిన నాలుగేళ్లలో పేదల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపికి ఆదరణ తెచ్చిపెడతున్నాయని అన్నారు. పేదల కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలవద్దకే తీసుకొచ్చిన ఘనత సిఎం వైఎస్ జగన్మోన్‌రెడ్డిదేనని అన్నారు. బాపట్ల పార్లమెంటు పరిధిలోని అన్నీ నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థుల గెలుపు ఖాయమని పేర్కొన్నారు. చీరాలలో కరణం వెంకటేష్ గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే వైసిపి గెలుపు ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపి సురేష్ సూచించారు. కార్యక్రమంలో యాతం సునీల్, సోషల్ మీడియా ప్రతినిధి యాతం క్రాంతి, యువజన నాయకులు పాలపర్తి జక్కరియా, మల్లెల జకరయ్య, గొర్రుముచ్చు సుమంత్, సలగల అనిరుద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యడం బాలాజీ

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తన్నీరు వెంకటరావు, కుంచపు ఆంజనే యులు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు సోమవారం వైసిపిలో చేరారు. వైసిపి ఇంచార్జి యడం బాలాజీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, నాయకులు మార్తయ్య, సుబ్బారావు, వీరయ్య, వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సెయింట్ ఆన్స్‌లో క్యాంపస్ సెలక్షన్స్

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో దివిస్ లేబరేటరీస్ కంపెనీ ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్ మంగళవారం నిర్వ హిస్తున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. దివిస్ లేబరేటరీస్ ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్‌కు బిటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్), బి ఫార్మసి, ఎం ఫార్మసి, బిటెక్ (కెమిస్ట్రీ), బిఎస్‌సి (కెమిస్ట్రీ), ఎంఎస్‌సి (మైక్రో బయాలజి), బిఎస్‌సి (మైక్రోబయాలజి) 2024 విద్యా సంవత్సరంలో పూర్తి చేయబోయే అన్నీ కళాశాలల విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. 2020 నుంచి 2023 వరకు ఆయా కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. క్యాంపస్ సెలక్షన్స్ సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల్లోని రిక్రూట్మెంట్ ఫెసిలిటినందు జరుగుతాయని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు పాల్గొనాలని ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్ పూర్ణచంద్రరావు కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి) లో ప్రవేశాలకు ఈనెల 12నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. విద్యాలయంలో 6వ తరగతికి 40సీట్లు, 7వ తరగతిలో ఒక సీటు, 8వ తరగతిలో ఒక సీటు, 9వ తరగతిలో రెండు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ గ్రూప్ నందు 40సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అదనపు సమాచారం కొరకు 99080 72726 నంబర్లో సంప్రదించాలని కోరారు.

సెలవుల్లో పిల్లల్ని పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఒంటి పూట బడులపై పిల్లల తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని మన బాల భారతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి తెలిపారు. పాఠశాల్లో గడిపిన విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రారంభం కావడం వల్ల ఆనందానికి అవధులు లేకుండా పోతుందని అన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లిదండ్రు లు ఒకింత ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఖాళీ సమయంలో పిల్లలు గ్రామాల సమీపంలోని చెరువులు, బావులు, నీటి కుంటల్లో సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

713 మంది పరీక్షకు హాజరు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో నాలుగు పదో తరగతి పరీక్ష కేంద్రాలు కేంద్రాలు కేటాయించినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. అన్నంబొట్లవారి పాలెం జడ్పీ హైస్కూల్లో ఏడుగురు, పర్చూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఇద్దరు, వైఆర్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో ముగ్గురు, నాగులపాలెం ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు మండలంలో మొత్తం 728మంది విద్యార్థులకు గాను 713మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

అభివృద్ధి డాక్టర్ ఉగ్రతోనే సాధ్యం

ప్రజాశక్తి - కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసన్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజయాన్ని కోరుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార కార్యక్రమాన్ని తెలుగుదేశం శ్రేణులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి అభివృద్ధి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితోనే సాధ్యమని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలందరికీ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతలపూడి తిరుపాలు, దొరసాని, గుడిపాటి ఖాదర్, కరాటే యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పథకాల పెక్సీలు

ఎన్నికల కోడ్ అమలు ఎక్కడ?

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

దేశవ్యాప్తంగా ఎన్నికల నగారా మోగింది. రాజకీయ నాయకుల ప్రచార పోస్టర్లు తొలగించారు. విగ్రహాలకు ముసుగులు వేశారు. కానీ యర్రగొండపాలెం పట్టణంలో మాత్రం అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. అందుకు ఉదాహరణే ఈ పోస్టర్. యర్రగొండపాలెం పట్టణంలోని 565 జాతీయ రహదారిలో యూనియన్ బ్యాంక్ పక్కన సోమవారం ఈ పోస్టర్ దర్శనమిచ్చింది. పోస్టర్‌ను చూసిన ప్రజలు ఇక్కడ ఎన్నికల కోడ్ అమలులో లేదా అని ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల పనితీరుకు ఇదో మచ్చుతునక.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చీరాల



పరీక్ష సామగ్రి పంపిణీ

పరీక్ష కేంద్రంకు హాజరయ్యే పదవ తరగతి విద్యార్థులు అందరూ మంచి ఉత్తీర్ణత సాధించాలని లూథరన్ చర్చి పాస్టర్ జోసఫ్ కేరి అన్నారు. ప్రతి విద్యార్థికి జీవితాన్ని మలుపు తిప్పే పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించాలని ఇవాంజలిస్ట్ యడం రవిశంకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, పెన్సిళ్లు, స్కేళ్ళు వంటి పరీక్ష సామాగ్రి బహుకరించారు. పరీక్షల్లో విద్యార్థులు బాగా రాయాలని ఉద్బోధించారు. అనంతరం పలువురు విద్యార్థులకు పంపిణీ చేశారు.

106 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం వివిధ కారణాల చేత 106 పొగాకు బేళ్లు ఇంటికి తిరుగుముఖం పట్టాయని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. వేలం కేంద్రానికి గోగినేని వారిపాలెం, పైడిపాడు, అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 879 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 773 బేళ్లు కొనుగోలు చేశారు. అత్యధిక ధర కిలో రూ.230, అత్యల్ప ధర కిలో రూ.220, సరాసరి ధర కిలో రూ.228.06 పలికిందని అన్నారు.

గవినివారిపాలెంలో అనారోగ్యం

పేరుకుపోయిన పారిశుధ్యం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని గవినివారిపాలెంకు జబ్బు చేసింది. గ్రామంలో సుమారు 60మందికిపైగా ఒక్కసారిగా అనారోగ్యం పాలయ్యారు. అందరూ ఉన్నట్లు ఉండి బిపి, పల్స్ పడిపోయి ప్రమాదకర స్థితిలో చీరాల పట్టణంలోని వివిధ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ఒక్కసారిగా అనారోగ్యంతో హాస్పిటల్ పాలు కావడంతో గ్రామంలో ఆందోళన మొదలైంది. తల తిరగడం, వాంతులు, నీళ్ల విరేచనాలు వెంట వెంటనే కావడం వంటి లక్షణాలతో పాటు బిపి, పల్స్ పడిపోవడం ఆందోళన కలిగిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు మారిపోవడం, తాగునీళ్లు ఏమైనా మారి ఉంటాయా అనే అనుమానం గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుపైగా గ్రామంలో నెలకొన్న అనారోగ్య పరిస్థితులతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిభిరం ఏర్పాటు



పేరుకు పోయిన చెత్తా చెదారం

చేసి పరీక్షలు చేయాలని, అనారోగ్య కారణాలను విశ్లేషించి వైద్య సహాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థికి తెల్లవారితే పరీక్షలు ఉండగా అనారోగ్యంతో వైద్యశాల్లో చేరాల్సిన పరిస్థితి వచ్చి పరీక్షలు కూడా రాయలేకపోయారు. గ్రామంలో పారిశుద్యం లేకపోవడం, ఊరి మద్యలో సంత కారణంగా పరిశుభ్రత లేకపోవడంతో అనారోగ్యం పాలౌతున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచి గవిని నాగేశ్వరరావు, గోనబోయిన సన్నిటిబాబు, అతని కొడుకు అనారోగ్యం పాలయ్యాడు.

టిడిపి అభ్యర్థిగా కొండయ్యను ప్రకటించాలి

టిడిపి నేతల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - చీరాల

టిడిపి ఎంఎల్ఎ చీరాల అభ్యర్థిగా ఎంఎం కొండయ్యను అధిష్టానం ప్రకటించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు స్థానిక టిడిపి కార్యాలయంలో మోకాళ్ళపై కూర్చొని అర్ధనగ్న ప్రదర్శన సోమవారం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి టిడిపి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన కొండయ్య పేరును ప్రకటించకుండా ఇతర పేర్లను ప్రకటిస్తే తాము మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఈపాటికే పలువురు తామే అభ్యర్థులం అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపు కుంటున్నారని అన్నారు. కావున ఇప్పటికైన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు చీరాల నియోజకవర్గ



అర్ధనగ్న ప్రదర్శలో టిడిపి నేతలు

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా కొండయ్య పేరును ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోకాళ్ళపై అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కౌతవరపు జనార్ధనరావు, గంజి పురుషోత్తం, తేజ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - సిఎస్ పురం

సిఎస్ పురం గ్రామంలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టిడిపిలో చేరారు. వారందరినీ కనిగిరి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. ముందుగా సిఎస్ పురం పట్టణ ప్రధాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన చూసి ప్రజలు విసుగు చెందారని అన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో వలసలు ప్రారంభమైనట్లు తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి కూటమి అధికారం లోకి రావాలన్నారు. సిఎస్ పురం మాజీ సర్పంచ్ మన్నేపల్లి రమణమ్మ, వైసిపి జిల్లా జాయింట్ సెక్రటరీ, మండల మాజీ వైసీపీ అధ్యక్షులు పాలకొల్లు వెంకటేశ్వరా ఒడ్డి, తెలుగు యువత మాజీ మండల అధ్యక్షులు మన్నేపల్లి రవికుమార్, సంగిశెట్టి శ్రీను, మన్నేపల్లి సురేష్, తిరుమలశెట్టి కిరణ్, రమణయ్య, నవీన్, వెంకటరత్నం,



టిడిపిలో చేరిన వారితో డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ఎండ్ల శ్రీను, గుర్రం నాగూరుతో పాటు 50 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో సిఎస్ పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, నాగిశెట్టి చిన్నమాల కొండయ్య, బొబ్బూరి రమేష్, బండారు వెంకటాద్రి, దాసరి మల్లికార్జున, జి వెంకట్రామరాజు, జగన్నాథం లక్ష్మి, బండారు మల్లికార్జున, పోకల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎంపీ అభ్యర్థిగా ఎంఎస్ రాజు ?

ప్రజాశక్తి - చీరాల

బాపట్ల పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా అనంతపురం జిల్లాకు చెందిన ఎంఎస్ రాజుకు ఖరారైనట్లు టిడిపి వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అందుకు సంబంధించి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు బాపట్ల పార్లమెంటు పరిధిలోని వివిధ నియోజకవర్గాల ప్రజలకు ఫోన్ సర్వే నిర్వహించారు. వైసిపి నేతలు టిడిపిపై చేస్తున్న విమర్శలను తిప్పి కొడుతూ దళితుల సమస్యలపై పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన అనుభవం రాజుకి ఉందని అంటున్నారు.



టిడిపి అధికార ప్రతినిధి రాజు

ఇటీవల ప్రచారంలోకి వచ్చిన మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు చిత్తూరు జిల్లాలో అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాపట్ల పార్లమెంటు అభ్యర్థిగా ఎంఎస్ రాజు పేరు తెరపైకి వచ్చింది. దాదాపు టికెట్ ఆయనకే ఖరారైనట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే అధికారికంగా మరో రెండు రోజుల్లో ప్రకటించే జాబితాలో ఎవరి పేరు ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.



పదోతరగతి పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఆర్‌డిఒ హేలాషారోన్

ఒంటిపూట బడులు ప్రారంభం

ప్రజాశక్తి - రేపల్లె

పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డిఒ హేలా షారోన్ తెలిపారు. స్థానిక మున్సిపల్ హై స్కూల్, పేటేరు హైస్కూలను ఆమె సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసామని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాలు పరీక్షా కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఒకటి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు తప్పనిసరిగా ఒంటిపూట బడులను నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణిని అభినందిస్తున్న సిబ్బంది

బాధ్యతలు స్వీకరించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కృషి విజ్ఞాన కేంద్రంలో పని చేసిన శాస్త్రవేత్త సిహెచ్ వరప్రసాద్ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని శాస్త్రవేత్తలు ఎల్ రాజేష్‌చౌదరితో పాటు రాష్ట్ర ఎంప్లాయిస్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావుతో పాటు పలువురు ఉద్యోగులు వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బాపట్ల

రైలులో కాంట్రాక్టు పద్ధతిన సమోసాలు అమ్ముకునే వ్యక్తి ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన బాపట్ల రైల్వే స్టేషన్లో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం రైలులో సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగించే షేక్ సమ్మర్ (45) ఆగి ఉన్న రైలు దిగి తిరిగి రైలెక్కే క్రమంలో జారీ రైలు పట్టాలపై పడి ఉండొచ్చని తెలుస్తోందని అన్నారు. మృత దేహం రెండు ముక్కలైందని అన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గంను వదిలి వెళ్ళడానికి తాను అనామకున్ని కాదని అధికార వైసిపి అభ్యర్థినని వైసీపీ ఇన్‌ఛార్జి పానెం హనీమిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన మూడు నెలల్లోనే నియోజకవర్గ ప్రజలు పూర్తిగా అండగా నిలిచి ఆదరించారని, అది తట్టుకోలేక టీడీపీ నేతలు ఒక పత్రికలో (ప్రజాశక్తి కాదు) తప్పుడు రాతలు రాయించి ఆనంద పడటం సరైన పద్ధతి కాదన్నారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనకు సీటు కేటాయించడంతో మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో సందర్శించడం కోసం వెళితే కనిపించడం లేదని ప్రకటించడం దుర్మార్గం అన్నారు. వైపీ ఆశీస్సులు, జగన్ మోహన్ రెడ్డి అండదండలతో అద్దంకిలో వైసీపీని గెలిపిస్తామని, తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు.

అక్రమ డబ్బు కట్టడికి

సమన్వయంతో పనిచేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల దష్ట్యా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతోఅనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, అక్రమంగా డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో బ్యాంకర్లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ దిశగా ఇప్పటికే జిల్లాలోని అన్ని బ్యాంకులను ఇఎస్ఎంఎస్ యాప్‌లో అనుసంధానం చేశామన్నారు. ప్రధాన బ్యాంకు నుంచి శాఖలకు, ఏటిఎంలకు నిధులను తరలిస్తున్నట్లయితే అందుకు సంబంధించిన వివరాలను స్పష్టంగా బాక్స్‌లపైన ప్రస్తావించడంతోపాటు పూర్తి వివరాలను క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉంచాలన్నారు. తద్వారా ఆ డబ్బులకు సంబంధించిన పూర్తి వివరాలు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి సభ్యులకు సమగ్రంగా తెలుస్తాయన్నారు. ఈ విషయంలో ప్రత్యేకంగా ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఎల్‌డిఎం అబ్దుల్ రహీం, ఈఎస్.ఎం.ఎస్. సాంకేతిక పరిశీలకులు భరద్వాజ్, పలువురు బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలు పాటించండి

కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్స్, బ్యానర్స్ లాంటి ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ స్పష్టం చేశారు.కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రింటర్స్ యాజమానులు, అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రెప్రెజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ సెక్షన్ 127 ఏ ప్రకారం ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో తప్పనిసరిగా సంబంధించిన ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామాలు లేకుండా కరపత్రాలను, పోస్టర్స్ ను ముద్రించరాదన్నారు. ఈ విషయాన్ని కచ్చితంగా ప్రింటర్స్ గుర్తించుకోవాలన్నారు. ఏ ప్రింటర్ అయినా ఈ నిబంధనలను అతిక్రమిస్తే ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ ను రద్దు చేయడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల పోస్టర్స్, కరపత్రాలు వంటి వాటిని ప్రచురించే ప్రింటర్స్ ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన అపెండెక్స్ ఏ , అపెండెక్స్ బి ప్రొఫార్మాలో డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సామాగ్రిని ముద్రించిన తరువాత 3 రోజుల్లో ముద్రణకు సంబంధించిన వివరాలను ఎన్నికల విభాగానికి సమర్పించాలని ప్రింటర్స్‌కు సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, సెక్రటరీ శ్రీధర్, ప్రింటర్స్ యజమానులు పాల్గొన్నారు

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ అర్జునరావు

ప్రజాశక్తి-మద్దిపాడు

ఉపాధి పనులను కూలీలను వినియోగించ ుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బొంత అర్జున్ రావు తెలిపారు. మండల పరిధిలోని అన్నంగి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పి.వెంకటస్వామి, ఎపిఒ ఆర్. ధనుంజయవర్మ, ఇసి కిషోర్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ వై.స్వాతి, బి.సోమేశ్వరరావు, సిహెచ్.హనుమాన్, ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ సందర్శన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్, ఒంగోలు కలెక్టరేట్ లో ఏర్పాటు చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను సోమవారం సందర్శించారు.కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేస్తున్న సోషల్ మీడియా సెల్, 24/7 కాల్ సెంటర్, కంప్లైంటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఎన్నికల వ్యయ విభాగాల ఏర్పాట్లను పరిశీలించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్వీప్ నోడల్ అధికారి రవి, కలెక్టరేట్ ఎఒ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ



కంప్యూటర్లు అందజేస్తున్న దాత

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలోని ఎస్‌కెఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలకు ఎపి గ్రానైట్ మిడ్‌వెస్ట్ ప్రై.లిమిటెడ్ కంపెనీ అధినేత కొల్లా రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాలుగు కంప్యూటర్లు, డిజిటల్ టివి సోమవారం అందజేశారు. కంపెనీ జనరల్ మేనేజర్ డివి. అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా కంప్యూటర్లు, టివి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. అంజిరెడ్డి, గ్రానైట్ మిడ్‌వెస్ట్ కంపెనీ హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ సతీష్, హెచ్ఆర్ ఎస్‌డి మహబూబ్ బాషా,హెచ్ఆర్ కొండలరావు, ఆఫీస్ సిబ్బంది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

పలు కేంద్రాలను పరిశీలించిన డిఇఒ



పరీక్షా కేంద్రం వద్దకు చేరిన విద్యార్థులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. పరీక్షల సందర్భంగా పరీక్షా కేం ద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆల్ ది బెస్ట్ అంటూ విజయ సంకేతం చూపించారు. జిల్లావ్యాప్తంగా 170 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 30,082 విద్యార్థులకు గానూ 29,317 మంది తొలిరోజు పరీక్షలకు హాజరయ్యారు. 765 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థుల హాజరు 97.45 శాతంగా నమోదైంది. జిల్లా విద్యా శాఖాధికారి డి.సుభద్ర పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. 45 సిట్టింగ్ స్క్వాడ్స్, 60 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారు.



హాల్ టిక్కెట్ నంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

నాగులుప్పలపాడు : మండలంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒలు రవికుమార్ , రమణయ్య తెలిపారు. మొత్తం 720 మంది విద్యార్థులకు గానూ 703 మందికి పరీక్షలకు హాజరు కాగా 17మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. ఉప్పుగుండూరు హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలో 127 మందికి 127మంది, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో 124 మందికి 120 మంది, నిడ మానూరు హైస్కూల్‌లో 208 మందికి 199 మంది, అమ్మనబ్రోలు హైస్కూల్‌లో 134 మందికి 131 మంది, అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాలలో 127 మందికి 126 మంది పరీక్షలకు హాజరైనట్లు వారు తెలిపారు. జిల్లా అబ్జర్వర్ ప్రసన్న కుమార్ అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరులోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

శింగరాయకొండ : మండలంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలు పరీక్షలు ప్రశాంతంగా ముగిశారు. గురుకుల పాఠశాలలో 226 మందికి గానూ 215 మంది పరీక్షకు హాజరయ్యారు 11 మంది గైర్హాజరయ్యారు. బాలికల పాఠశాలలో 200 మంది, 198 మంది పరీక్షలు రాశారు. ఇద్దర గైర్హాజరయ్యారు. భాష్యం స్కూల్లో 169 మందికి 168 మంది పరీక్షలకు హాజరయ్యారు. గైర్హాజరయ్యారు. గవర్నమెంట్ హైస్కూల్లో 227 మందికి 217 మంది హాజరయ్యారు పదిమంది గైర్హాజరయ్యారు. మొత్తం 822 మందికి 798 మంది పరీక్షకు హాజరయ్యారు. 24 గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్ అధికారి నాగేంద్ర వర్మ ఆకస్మికంగా పరిశీలించారు. సిఐ రంగనాథ్, ఎస్ఐ టి. శ్రీ రామ్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్దిపాడు : పదోతరగతి పరీక్షలకు తొలి రోజు సోమవారం 523 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ-1 ఆంజనేయులు తెలిపారు. మొత్తం 542 మంది విద్యార్థులకు గాను 523 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

సిమెంట్ బల్లలకు ఎన్నికల కోడ్..!



తహశీల్దారు కార్యాలయం వద్ద తిరగేసిన సిమెంట్ బల్ల

ప్రజాశక్తి-శింగరాయకొండ

గతంలో శింగరాయ కొండ, మూలగుంట పాడు గ్రామ పంచాయతీ సర్పంచులుగా పనిచేసిన డాక్టర్ కుంభా నాగమణి చుక్కా కిరణ్ కుమార్ ప్రజలకు కూర్చేనేందుకు వివిధ ప్రేభుత్వ కార్యాలయ వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కార్యాలయాల వద్దకు వచ్చిన ప్రజలు వాటి మీద ఎక్కడ కూర్చుంటారేమోనని ఆ బల్లలను తిరగేశారు. శింగరాయకొండ తహశీల్దారు కార్యాలయం వద్ద నాలుగు బల్లలు ఏర్పాటు చేశారు. ఆ బల్లలు సోమవారం తిరగేసి ఉన్నాయి ఆ బల్లల పై చుక్కా కిరణ్ కుమార్, డాక్టర్ కుంభ నాగమణి పేరు ఉందని వాటిని తిరగేసి అధికారులు శభాష్ అనిపించుకున్నారు. శింగరాయకొండలో పలు చోట ఇలాంటివి బల్లలు ఉన్నాయి. ఇటీవల ప్రారంభోత్సవం చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖద్వారం జాతీయ రహదారిపై బాలాజీ నగర్ వద్ద అలాగే కనిపిస్తుంది. అక్కడ ఉన్న విగ్రహాలకు ముసుగులు తొలగి వదిలేశారు. బాలాజీ నగర్ వద్ద కూడా తెలుగుదేశం నాయకుల బల్లలు అలాగే కనిపిస్తున్నాయి. చేపల మార్కెట్ వద్ద ఇదే పరిస్థితి. శింగరాయకొండ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే రోడ్ లో కూడా మాగుంట సుబ్బరామిరెడ్డి ముఖద్వారం అని ఉంది. ముఖ్యమంత్రులు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులను సైతం పేర్లను బహిరంగంగా కనిపిస్తున్న వదిలేశారు. ప్రజలు పనిమీద వచ్చి కూర్చోవడానికి ఉన్న బలలపై సర్పంచుల పేర్లు ఉన్నాయని అధికారులు తిరగవేయటంపై శింగరాయ కొండ పట్టణంలో విచిత్రంగా చెప్పు కుంటున్నారు. ఎన్నికల కోడ్ అంటే ఇలా ఉంటుందా అని ముక్కున వేలేసుకుంటున్నారు.